క్లుప్తంగా

5న పాలకొల్లులో జాతీయ లోక్ అదాలత్


షేక్ జియావుద్దీన్

యలమంచిలి: పాలకొల్లు కోర్టు ఆవరణలో జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియావుద్దీన్ చెప్పారు. కోర్టు ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ అమరావతి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీయోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చునని ఆయన వివరించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు అప్పటికే కోర్టు ఫీజు కట్టి ఉంటే ఆ ఫీజు కూడా వెనక్కు వస్తుందన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతిరోజూ పాలకొల్లు కోర్టులో ప్రీ–లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తామని, కక్షిదారులు సదరు సిటింగ్‌లలో తమ కేసులు రాజీ చేసుకోవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

అగ్ని ప్రమాద బాధితుడికి సాయం

పెనుగొండ: ఆచంట మండలం కందరవల్లి గ్రామంలో అగ్ని ప్రమాద బాధితుడు రావి నాగేశ్వరావు కుటుంబానికి మాలమహానాడు ఆధ్వర్యంలో సాయం చేశారు. మాలమహానాడు ఆచంట మండలం యూత్ వైస్ ప్రెసిడెంట్ రావి చిన్న వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఆచంట మండలం అధ్యక్షులు రావి నాగరాజు ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన నిత్యావసరాలను మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సరెళ్ల నాగరాజు, పంతగాని ప్రసాద్, కుక్కల ఏడుకొండలు, రావి సత్యనారాయణ, ఇంజటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం కాదు వంచన


జి.సుందర్ కుమార్

ఉండి: తల్లికి వందనం సొమ్మును ఇచ్చేస్తున్నామంటూ భారీ ఎత్తున ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కాదు వంచన చేస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.సుందర్‌కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ తల్లికి వందనం క్రింద రూ.15 వేలు ప్రతీ ఏటా ఇచ్చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 87.45 లక్షల మంది పిల్లలు వుంటే 67.27 లక్షల మందికి మాత్రమే ఇవ్వడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. అందరికీ ఇస్తానని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు కేవలం 58 లక్షల మందికి మాత్రమే ఇచ్చి మిగిలిన 29 లక్షల మందికి ఎందుకు ఇవ్వడం లేదో రాష్ట్ర ప్రజలకు,రాష్ట్రంలోని తల్లులకు చెప్పాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ఈ ఏడాది ఇచ్చేస్తున్నామని చెప్పుకుంటూ పండుగ చేసుకునేందుకు సిద్ధపడుతున్న కూటమి నాయకులు గతేడాది ఎందుకివ్వలేదో? చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకే గతేడాది ఎగ్గొట్టిన సొమ్ముతో కలిపి ఈ ఏడాది ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్ఆర్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్‌గా ఉంది. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మిస్తే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం చెబుతుంటే కార్పొరేట్ సంస్థల అధిపతులు సీట్లు ఇవ్వడానికి అనేక ఆంక్షలు విధిస్తున్నారని, అటువంటి విద్యా సంస్థలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం డీవైఈఓ ధర్మేంద్రకు నాయకులు వినతిపత్రం సమర్పించారు. వక్తలు మాట్లాడుతూ విద్యా సంస్థలలో విద్య వాపారంగా మారిందని దీనిలో భాగంగా పుస్తకాలు కూడా విచ్చలవిడిగా అమ్ముతున్నారని వీటిపై చర్యలు తప్పక తీసుకోవాలన్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్యా వ్యాపారంపై రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, అనీల్, రాజు, భార్గవ్, సాయి పాల్గొన్నారు.

అధికారులు ప్రోటోకాల్ పాటించరా?

పెనుమంట్ర: అధికారులు గ్రామాలలో స్థానిక ప్రజా ప్రతినిధులను అవమాన పరిచే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఏడాది కాలంగా గ్రామాలలో జరిగే అనేక అభివృద్ధి కార్యక్రమాలలో ప్రోటోకాల్ విస్మరించి వ్యవహరిస్తున్నారని, అలాంటి సంఘటనలు ఇకనుంచి జరిగితే ఊరుకునేదిలేదని ఆయన హెచ్చరించారు. గ్రామంలో ఏ కార్యక్రమం చేపట్టినా ఆ గ్రామ సర్పంచ్‌తో పాటు, ఎంపీటీసీ సభ్యుడికి కూడా సమాచారం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరిస్తూ అధికారులు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ జీఎస్ ప్రభాకరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, ఫిర్యాదు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తహసీల్దార్ వై.రవికుమార్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం డబ్బులు ఇంకా పడాల్సిన మాట వాస్తమేనని, అంచనాలకు మించి దిగుబడులు రావడం ఈ జాప్యానికి కారణమైందన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులతో మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి విధిగా హాజరుకావాల్సిన మత్స్యశాఖ, రవాణా, ఎక్సైజ్ శాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టడంపై స్థానిక ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో విద్యుత్, రోడ్లు, సాగునీటి కాలువలు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా వంటి కీలక సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని అధికారులు వివరించారు.


పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి


ధాన్యం బకాయిల సొమ్మును విడుదల చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి

ధాన్యం బకాయిలను తక్షణమే చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వం పెనుమంట్ర మండలంలో రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ. 20 కోట్ల ధాన్యం బకాయి సొమ్ములను తక్షణమే చెల్లించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రిగౌరీ సుభాషిణి వినతిపత్రం అందజేశారు. రైతులు పండించిన పంటకు మండలంలో మేనెల 9 నుంచి ధాన్యం అమ్మిన రైతులకు సుమారు రూ. 20 కోట్ల బకాయిలు ఉన్నాయని, ఇప్పటికే అకాల వర్షాలు కారణంగా , ప్రభుత్వం నుండి రైతు భరోసా సాయం అందకపోవడ,ం ఉచిత పంటల బీమా లేకపోవడం వల్ల నష్టపోయారని, ఇప్పటికే రైతులు అధిక వడ్డీలకు తెచ్చిన డబ్బులు చెల్లించడానికి ప్రభుత్వం నుంచి డబ్బులు రాక నానా అవస్థలులు పడుతున్నారని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అన్నదాత సుఖీభవ 2024–25 ఏడాదికి నగదు సాయం అందజేసి, రైతులను ఆదుకోవాలని కోరారు.

మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి

నరసాపురం: కుళాయిల ద్వారా ఒక్కపూటే మంచినీటి సరఫరా చేస్తున్నందు వల్ల నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో లేని విధంగా ఈ ఏడాది కాలువలు ఎక్కువ రోజులు కట్టేశారని, అందువల్ల ముందు జాగ్రత్త చర్యగా ఉదయం పూట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వారం రోజుల్లో మళ్లీ రెండుపూటలా నీరిచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదకరంగా వంతెన మార్గం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలెంకు వెళ్ళే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ, ఇటూ కూడా రాళ్ళు పైకిలేచిపోయాయి. రోడ్డు కూడా శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంతోకాలంగా ఈ వంతెన మార్గం వైపు రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కాళ్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సరాబు సునీల్ తెలిపారు. మండలంలోని వేంపాడు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరే తాగాలని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అనారోగ్యం వచ్చినా ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు


అమ్మవారి పూరిగుడి వద్ద గరగనృత్యం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జేష్ఠమాస జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి రాత్రి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రాత్రి మావుళ్లమ్మ అమ్మవారి పూరి గుడి వద్ద శ్రీఅమ్మవారి రాత్రి సేవ కార్యక్రమాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రారంభించారు. అనంతరం గరగల నృత్యం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

యలమంచిలి: వైఎస్సార్ సీపీని సంస్థాగతంగా బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తల మీదనే ఉందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు చెప్పారు. కట్టుపాలెం గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలనే లక్ష్యంతోనే ప్రతి గ్రామంలో పార్టీ కమిటీలు వేస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకుని నిర్ధారణ నిమిత్తం జాబితాను పార్టీ కార్యాలయానికి పంపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి, వైఎస్సార్ సీపీ మండల, జిల్లా నాయకులు ఇనుకొండ రవి, గుర్రాల వెంకట్రావు, పొన్నమండ ధర్మారావు, పెచెట్టి రాంబాబు, దీపాటి మూర్తి, కర్రి దుర్గారావు, పొన్నమండ ఏడుకొండలు, లంకే శ్రీను, విపర్తి కృష్ణారావు, విపర్తి జార్జి, లంకే దుర్గారావు, గుడాల సురేష్, కళ్యాణం గంగాధరరావు, కుక్కల బాలచంద్రన్, పోలుకొండ వెంకట్, మోకా ప్రేమ్‌చంద్, సిర్రా నాగరాజు, కుక్కల రామకృష్ణ, కడిమి బాలు, కడిమి శ్రీరామ్, నక్కవరపు సత్యనారాయణ, కాండ్రేకుల బాబీ, కడలి రాము, బుడితి జాన్, పొన్నమండ గంగరాజు, పొన్నమండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కట్టుపాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో మండల, జిల్లా నాయకులు

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

పెనుగొండ: పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన ఐదు నెలల వేతన బకాయిలు, 18 నెలల పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు తక్షణం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం తహసీల్దార్ ఆఫీసు, సీహెచ్ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత, స్వచ్ఛత కాపాడేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించకుండా కాంట్రాక్టర్ బకాయి పెట్టడం అమానుషమన్నారు. ఆరోగ్య కేంద్రం సక్రమంగా నడవాలంటే తక్షణం కాంట్రాక్టర్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్మికులు సీహెచ్‌సీపీ ఆస్పత్రి సూపరింటెండెంట్ జె.విజయలక్ష్మికి, తహసీల్దార్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ టి.రమకు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాదాసు నాగేశ్వరరావు, ఎస్‌కే బాదుషా తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నరసాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం



పాలకొల్లులో ధర్నా చేస్తున్న పురపాలక ఇంజనీరింగ్ కార్మికులు

నరసాపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. 10 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, హెచ్ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించుకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పాలకొల్లులో..

యలమంచిలి: పాలకొల్లు పురపాలక సంఘంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న టెక్నికల్, నాన్ టెక్నికల్ ఇంజనీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ గురువారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పది సంవత్సరాలు పైబడిన సర్వీస్ ఉన్న వారిని రెగ్యులరైజ్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, పెన్షన్ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ఉద్యోగ విరమణ కాలాన్ని 60 నుండి 62 సంవత్సరాలకు పెంచాలని, డ్యూటీలో అకస్మాత్తుగా మరణించిన ఉద్యోగికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు గోపి, ఆనంద్, శ్రీనివాస్, ఆంజనేయులు, శివ, సూర్యనాగు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

యలమంచిలి: పేదలకు సహాయం చేయడంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయ సరిత చూపిస్తున్న చొరవ ప్రసంశనీయమని కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాజ తూర్పు పంచాయతీ మారంపూడి వారి పేటకు చెందిన గొల్ల సువార్త పేదరికంతో ఇబ్బందులు పడుతుంది. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న జయ సరిత గురువారం సువార్త ఇంటికి వెళ్లి సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలసి ఆమెకు నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, రాపాక నారాయణరావు, మారంపూడి జాన్ తదితరులు పాల్గొన్నారు.


గొల్ల సువార్తకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

పంట సాగుకు విత్తనాల ఎంపికే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఉండి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు

యలమంచిలి: రైతులు ఏ పంట సాగు చేసినా నాణ్యమైన దిగుబడులు సాధించాలంటే ముందుగా విత్తనాల ఎంపికే కీలకమని ఉండి కృషి విజ్ఞాన కేంద్ర (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు చెప్పారు. కాంబొట్లపాలెం, బూరుగుపల్లి, గుంపర్రు క్లస్టర్ గ్రామాల రైతులకు గురువారం గుంపర్రు గ్రామ సచివాలయం వద్ద వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో కేవీకే శాస్త్రవేత్తలు నిర్వహించారు. ఈ సమావేశంలో మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ క్లస్టర్ పరిధిలోని గ్రామాలన్నీ వరద ముంపు ప్రభావిత గ్రామాలు కాబట్టి వరి సాగు చేసే రైతులు మేలైన, ముంపు తట్టుకునే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ మనోరమ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు ఎక్కువ లాభం పొందే ఆస్కారం ఉందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి ఉన్న రైతులు ఉంటే వారికి సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు పొందడానికి సహకారం అందిస్తామన్నారు. డాక్టర్ వినయలక్ష్మీ మాట్లాడుతూ కలుపు, నీటి, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే నాణ్యమైన దిగుడులు సాధించి అధిక ఆదాయం పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంపర్రు ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ, నీటి సంఘం అధ్యక్షులు ఆరిమిల్లి రామశ్రీనివాస్, జడ్డు రాజేష్ రైతు నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం వెంకట నరసింహారావు (నాని), రేఖపల్లి రెడ్డినాయుడు, చిట్టూరి సీతారామాంజనేయులు, ఈతకోట శేషగిరిరావు, చేగొండి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కేశవరావు, తమ్మినీడి ప్రసాద్ మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, వెటర్నరీ డాక్టర్ పోరెడ్డి చంద్రశేకరరెడ్డి రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం


పాలకొల్లులో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం


చిట్టవరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురువారం పాలకొల్లు అర్బన్ సెక్టార్ పరిధిలోని దాసరి నారాయణరావు మున్సిపల్ స్కూల్‌లో మన అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలలతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఆట ఆధారిత విద్యను అందిస్తున్నట్లు వివరించారు. దీని వల్ల బాలల్లో బ్రెయిన్ డెవలప్మెంట్ అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బత్తుల మేరీ నిర్మల కుమారి, వార్డు ఇన్‌చార్జి ముప్పిరి సత్యనారాయణ, మహేష్, ముసలయ్య, స్కూల్ హెచ్ఎం జేజేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో

నరసాపురం రూరల్: మొగల్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో యర్రంశెట్టివారి పాలెం పంచాయతీలోని తూర్పుతాళ్లు, పసలదీవి, తెలగంశెట్టి వారి మెరక ప్రాథమిక పాఠశాలలో గురువారం 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించి ప్రిస్కూల్ సిలబస్, అంగన్‌వాడీ చదువు, ఆట పాటల విద్య పిల్లల సమగ్రాభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుందో తల్లిదండ్రులకు వివరించారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కుకు కార్మికుల పోరాటానికి మద్దతుగా తాడేపల్లిగూడెం పట్టణంలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ కార్మికులు సాగిస్తున్న పోరాటాలు విజయవంతం అయ్యే వరకు కార్మికవర్గం అండగా ఉంటుందని తెలిపారు. ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ పిలుపు మేరకు దేశ వ్యాప్త సంఘీభావ దినం పాటిస్తున్నట్లు చెప్పారు. ఉక్కు పరిశ్రమ నుంచి తొలగించిన సిబ్బందిని తిరిగి విధుల్లో తీసుకోవాలని, కార్మికుల జీతం బకాయిలను చెల్లించాలని, విశాఖ ఉక్కుకు సొంతగనిని కేటాయించాలని, నిజమైన పెట్టుబడి పెట్టాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలన్నారు. విశాఖ ఉక్కును ఒక పథకం ప్రకారం కార్పొరేట్లుకు కట్టబెట్టేందుకు పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక సంఘాలు చేస్తున్న ప్రతిపాదనలను ప్రభుత్వం పెడచెవిని పెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జూలై 9వ తేదీన కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సార్వత్రిక సమ్మె ఉంటుందని, విజయవంతం చేయాలని కోరారు.

చినమిల్లికి అభినందనలు


భీమవరంలో చినమిల్లి వెంకట్రాయుడును అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నూతనంగా నియమితులైన చినమిల్లి వెంకట్రాయుడుకు అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ సమన్వకర్తగా చినమిల్లిని నియమించడంతో పార్టీశ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా పార్టీ ఇన్‌చార్జ్ లేకపోయినా నియోజకవర్గంలోని నాయకులంతా కలసికట్టుగా పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపుమేరకు కార్యక్రమాలను విజయవంతం చేశారు. నూతనంగా వెంకట్రాయుడును సమన్వయకర్తగా నియమించడంతో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రాయలం గ్రామంలోని వెంకట్రాయుడు ఇంటికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా చినమిల్లి మాట్లాడుతూ పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ పటిష్టానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో వేండ్ర వెంకటస్వామి, గూడూరి ఉమాబాల, మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, కోడే విజయలక్ష్మి, పేరిచర్ల విజయనర్సింహరాజు, చిగురుపాటి సందీప్, గాదిరాజు రామరాజు, జల్లా కొండయ్య, చవాలకు సత్యనారాయణ, కోడే యుగంధర్, తిరుమాని ధనుంజయ, పెనుమాల నర్సింహస్వామి, గంటా సుందరకుమార్, చికిలే మంగతాయారు, పాలవెల్లి మంగ,అల్లూరి రవిరాజు తదితరులున్నారు.